సుప్రీంకోర్టు జడ్జిగా మన్మోహన్ ప్రమాణం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మన్మోహన్ (61) గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. ఆయన చేత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టులో మొత్తం జడ్జీల సంఖ్య 34 (సీజేఐతో సహా). ప్రస్తుతం జస్టిస్ మన్మోహన్‌తో కలిపి 33 మంది న్యాయమూర్తులు ఉన్నారు.

జనానికి చట్టంపై గౌరవం, భయం లేవు

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నా, ఫలితం ఉండటం లేదని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం చెప్పారు. ప్రజలకు చట్టం పట్ల గౌరవం, భయం లేవని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. తాను కూడా రోడ్డు ప్రమాద బాధితుడినేనని అన్నారు. హెల్మెట్లు ధరించకపోవడం వల్ల 30 వేల మంది మరణించారని చెప్పారు. ఈ సంవత్సరం 1.68 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని పేర్కొన్నారు.

నాసా చీఫ్‌గా మస్క్ సన్నిహితుడు

ఐజాక్‌మాన్‌ను నియమించిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా) చీఫ్‌గా ఎలాన్ మస్క్ వ్యాపార సన్నిహితుడు, ప్రైవేట్ వ్యోమగామి జేర్డ్ ఐజాక్‌మన్‌ను అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. ఎలాన్ మస్క్ స్థాపించిన స్పేస్‌ఎక్స్ నిర్వహణ బాధ్యతలను ప్రస్తుతం ఐజాక్‌మన్ నిర్వహిస్తున్నారు. ఐజాక్‌మన్ రెండుసార్లు అంతరిక్ష ప్రయాణం చేశారు.

నచ్చిన కోర్సును ఎంచుకోవచ్చు!

- గతంలో చదివిన సబ్జెక్టులు ఏవైనా సరే
- యూజీ, పీజీలో నచ్చిన కోర్సుల్లో చేరొచ్చు
- ప్రవేశ పరీక్షలో అర్హత సాధిస్తే సరిపోతుంది
- ఇక మీదట ఏడాదికి రెండు సార్లు ప్రవేశాలు
- ఏక కాలంలో రెండు కోర్సులు చదవొచ్చు
- ఉన్నత విద్యలో సమూల మార్పులకు శ్రీకారం
- యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: ఉన్నత విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు యూజీసీ శ్రీకారం చుడుతున్నది. యూజీ, పీజీ కోర్సుల ప్రవేశాలు, వ్యవధి, అర్హతలకు సంబంధించి అనేక సంస్కరణలను ప్రతిపాదించింది. ఈ మేరకు కొత్త మార్గదర్శకాలతో ముసాయిదాను గురువారం ప్రకటించింది. కొత్త నిబంధనలు చాలా వరకు విదేశీ వర్సిటీల విద్యా విధానాలను పోలి ఉన్నాయి. ముందు చదివిన కోర్సుతో సంబంధం లేకుండా నచ్చిన కోర్సును డిగ్రీ, పీజీలో ఎంచుకునే వీలు కల్పించింది. పలు దేశాల్లో అనుసరిస్తున్న ఏడాదికి రెండుసార్లు ప్రవేశాలు, ఏకకాలంలో రెండు కోర్సులు చదివే అవకాశం వంటి వాటిని ఈ ముసాయిదాలో పొందుపరిచారు. విద్యార్థులకు తరగతి గది అంశాలతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారు. ఈ సంస్కరణల ద్వారా దేశ ఉన్నత విద్యా వ్యవస్థను ప్రపంచ ప్రమాణాలను చేరుకునేలా చేస్తామని యూజీసీ చైర్‌పర్సన్ జగదీశ్ కుమార్ పేర్కొన్నారు. మూలాలను అంటి పెట్టుకొని ఉంటూనే, విద్యార్థుల విభిన్నమైన అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు.

ముసాయిదాలోని కీలక మార్పులు

- ఏడాదికి రెండుసార్లు కోర్సుల్లో చేరేందుకు ప్రవేశాలు కల్పిస్తారు. జూలై/ఆగస్టు, జనవరి/ఫిబ్రవరిలో ప్రవేశాలు నిర్వహిస్తారు.
- విద్యార్థి 12వ తరగతి లేదా ఇంటర్, డిగ్రీలో ఏ సబ్జెక్టు చదివాడనేది సంబంధం లేకుండా డిగ్రీ, పీజీ చేసే అవకాశం ఉంటుంది. ఇందుకోసం జాతీయ స్థాయిలో లేదా వర్సిటీ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.
- విద్యార్థులు డిగ్రీ కోర్సులో మొత్తం క్రెడిట్లలో 50 శాతం కోర్సులోని ప్రధాన సబ్జెక్టుల నుంచి పొందాలి. మిగతా 50 శాతం క్రెడిట్లను నైపుణ్యాభివృద్ధి కోర్సులు, అప్రెంటిస్‌షిప్, బహుళ సబ్జెక్టుల నుంచి పొందొచ్చు.
- విద్యార్థులు ఒకేసారి రెండు డిగ్రీ లేదా పీజీ కోర్సులను చదివే అవకాశం ఉంటుంది.
- డిగ్రీ కోర్సు వ్యవధిని తగ్గించుకునేందుకు లేదా పెంచుకునేందుకు వీలు ఉంటుంది. ఇందుకోసం యాక్సెలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రాం(ఏడీపీ), ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రాం(ఈడీపీ) విధానాలను ప్రవేశపెట్టనున్నారు.

ఆరు సెంట్రల్ వర్సిటీల్లో ఏడాదికి రెండుసార్లు అడ్మిషన్లు

ఇక నుంచి వివిధ కోర్సుల్లో ఏడాదికి రెండు సార్లు ప్రవేశాలు నిర్వహించాలని భారత్‌లోని ఆరు సెంట్రల్ యూనివర్సిటీలు నిర్ణయించాయి. ఉన్నత విద్యా సంస్థల్లో చేరికకు విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో ఏడాదికి రెండుసార్లు అడ్మిషన్లు నిర్వహించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ణయించడంతో కేంద్రం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, తేజ్‌పూర్ యూనివర్సిటీ, నాగాలాండ్ యూనివర్సిటీలు ఏడాదికి రెండుసార్లు అడ్మిషన్లు నిర్వహించాలని నిర్ణయించాయి. ఈ అడ్మిషన్లు ప్రతి ఏడాది జూలై/ఆగస్టు, జనవరి/ఫిబ్రవరిలో జరుగుతాయి. .

డైమండ్ బ్యాటరీ

- **నిరంతరాయంగా 11 వేల ఏండ్లపాటు మన్నిక**
- **వైద్య పరికరాలు, రోదసి మిషన్లకు ఉపయుక్తం**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): సాధారణ బ్యాటరీ లైఫ్ ఎంతకాలం ఉంటుంది? ఒకటి లేదా రెండేండ్లు. అయితే, బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్, యూకే అటామిక్ ఎనర్జీ అథారిటీకి చెందిన పరిశోధక బృందం అభివృద్ధి చేసిన బ్యాటరీ ఏకంగా 11 వేల ఏండ్లకు పైగా నడుస్తుంది. దీన్ని 'డైమండ్ బ్యాటరీ'గా పిలుస్తున్నారు.

ఏమిటీ బ్యాటరీ?

సోలార్ ప్యానెల్స్ సూర్యకాంతిని విద్యుత్తుగా మార్చినట్టే, కార్బన్-14 రేడియో యాక్టివ్ ఐసోటోప్ రేడియేషన్ సాయంతో విద్యుత్తును ఉత్పత్తి చేసే బ్యాటరీనే 'డైమండ్ బ్యాటరీ'గా పిలుస్తున్నారు. 'కార్బన్-14' నిరంతరాయంగా 11,400 ఏండ్లపాటు రేడియేషన్‌ను ఉత్పత్తి చేస్తుంది. అలాగే, డైమండ్ బ్యాటరీ కూడా అంతేకాలంపాటు విద్యుత్తును ఉత్పత్తి చేయగలదని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ బ్యాటరీ వేసిన డివైజ్ 11,400 ఏండ్లపాటు నిరంతరాయంగా పనిచేయగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.



వినియోగం ఎక్కడంటే?

హార్ట్ రేటును క్రమబద్ధీకరించే పేస్‌మేకర్లు బ్యాటరీ ఆధారంగానే పనిచేస్తాయి. బ్యాటరీలో పవర్ అడుగంటినప్పుడు వాటిని తరుచూ మార్చడం కష్టమౌతుంది. ఈ సందర్భాల్లో ఏండ్లపాటు నిరంతరాయంగా పనిచేసే డైమండ్ బ్యాటరీని వినియోగించవచ్చు. అంతేకాకుండా వినికిడి సమస్యలు ఉన్నవారు వాడే హియరింగ్ ఎయిడ్స్‌తో పాటు రోదసి ప్రయోగాల్లో స్పేస్‌క్రాఫ్ట్, శాటిలైట్స్ పనిచేయడానికి వాడే బ్యాటరీలు కూడా నిరంతరాయంగా పనిచేయాల్సి ఉంటుంది. వీటికి కూడా డైమండ్ బ్యాటరీ ఓ చక్కటి ప్రత్యామ్నాయమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

మహారాష్ట్ర సీఎంగా మూడోసారి

- **ప్రమాణస్వీకారం చేసిన దేవేంద్ర ఫడ్నవీస్**
- **ఉప ముఖ్యమంత్రులుగా షిండే, పవార్**

ముంబై, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. కొత్త ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం సాయంత్రం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు ఎన్డీఏ పాలిత రాష్ర్టాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, రణ్‌బీర్ కపూర్, మాధురీ దీక్షిత్, సచిన్ టెండుల్కర్, ముఖేశ్ అంబానీ వంటి వివిధ రంగాల ప్రముఖులు సైతం పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ బాధ్యతలు స్వీకరించడం ఇది మూడోసారి. సీఎం, ఉప ముఖ్యమంత్రులు మినహా మంత్రులుగా ఎవరూ ప్రమాణస్వీకారం చేయలేదు. వచ్చే వారం మంత్రివర్గ విస్తరణ ఉంటుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. మొదట ముఖ్యమంత్రి పదవి కోసం పట్టుబట్టిన ఏక్‌నాథ్ షిండే చివరకు ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్నారు. అయితే, ఉప ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారా లేదా అనే దానిపై కొన్ని గంటల ముందు వరకు గందరగోళం నెలకొంది. బీజేపీ అధిష్ఠానం, ఫడ్నవీస్ బుజ్జగించడంతో ఆయన ఎట్టకేలకు డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు.

ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం

ప్రధానిపై నెగ్గిన అవిశ్వాసం • కూలిన ప్రభుత్వం..

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ప్రధాని మిషెల్ బార్నియర్ సారథ్యంలోని మితవాద మైనారిటీ సంకీర్ణ ప్రభుత్వం మూడు నెలల్లోనే కూలిపోయింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మూడు నెలలకే ఆయన తన పదవికి రాజీనామా చేయడంతో దేశంలో రాజకీయ సంక్షోభం తలెత్తింది. వామపక్ష పార్టీలతో పాటు ఇతర పార్టీలకు చెందిన మొత్తం 331 మంది సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మొత్తం 577 పార్లమెంట్ సభ్యులలో 331 మంది బార్నియర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో బుధవారం ప్రభుత్వం పతనమైంది. ప్రధాని బార్నియర్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో దేశంలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తన రెండు పర్యాయాల పదవీ కాలంలో అత్యంత సంక్లిష్టమైన రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. 2025 జూలై వరకు కొత్తగా పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించడానికి అవకాశం లేకపోవడంతో రెండుగా చీలిపోయిన పార్లమెంట్‌ను కొనసాగించడానికి మాక్రాన్ ప్రత్యామ్నాయ అవకాశాలను అన్వేషించాల్సి ఉంటుంది. ఈ ఏడాది జూన్‌లో మాక్రాన్ హఠాత్తుగా పార్లమెంట్ ఎన్నికలకు పిలుపునివ్వడంతో ఎన్నికైన సభ్యులు మూడు గ్రూపులుగా ఏర్పడడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ ఏ గ్రూపునకు లేకపోయింది. అత్యధిక ఓట్లు సాధించినప్పటికీ వామపక్ష కూటమికి మెజారిటీ సీట్లు లభించలేదు. రెండు నెలల రాజకీయ ప్రతిష్ఠంభన అనంతరం సెప్టెంబర్‌లో బార్నియర్‌ను ప్రధానిగా మాక్రాన్ నియమించారు. 1962 తర్వాత అవిశ్వాసం ద్వారా కూలిన తొలిప్రభుత్వం ఇదే.

రొమ్ము క్యాన్సర్‌కు

'క్లిప్ అండ్ బ్లూ' చికిత్స

- **కొత్త పద్ధతిని అభివృద్ధి చేసిన కేరళ వైద్యులు**
- **కీమోథెరపీ తర్వాత మిగిలిన కణతుల తొలగింపునకు వినియోగం**



ఎర్నాకులం, డిసెంబర్ 5: రొమ్ము క్యాన్సర్ బాధితుల్లో పూర్తి స్థాయిలో కణతులను తొలగించేందుకు కేరళకు చెందిన వైద్యులు సరికొత్త విధానాన్ని అభివృద్ధి చేశారు. క్యాన్సర్ బాధితుల్లో కీమోథెరపి చేసిన తర్వాత కొన్ని కణతులు మిగిలిపోతాయి. వీటిని గుర్తించి, తొలగించడం ఖరీదైన వ్యవహారం. ఇందుకు ఉపయోగించే వైర్లు, క్లిప్‌ల ధర ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా 'క్లిప్ అండ్ బ్లూ ప్లేస్‌మెంట్' అనే కొత్త విధానాన్ని కేరళలోని ఆలువాలో ఉన్న రాజగిరి హాస్పిటల్‌కు చెందిన వైద్య బృందం అభివృద్ధి చేసింది. 'ఈ ప్రక్రియలో భాగంగా కీమోథెరపీకి ముందే మూడు, నాలుగు సర్జికల్ క్లిప్స్‌ను క్యాన్సర్ కణతుల్లోకి పంపిస్తాం. కీమోథెరపీ తర్వాత అల్ట్రా సౌండ్ ద్వారా ఈ క్లిప్‌లను గుర్తించి, దాంట్లోకి మిథిలీన్ బ్లూ డై పంపిస్తాం. దీంతో కీమోథెరపీ తర్వాత మిగిలిన కణతులను సులభంగా గుర్తించొచ్చు' అని రాజగిరి హాస్పిటల్ ఆంకాలజీ సర్జన్ డాక్టర్ ఆనంద్ ఎబిన్ వివరించారు. ఈ కొత్త విధానం ద్వారా చికిత్స ఖర్చు రూ.30 వేల నుంచి రూ.2 వేలకు తగ్గుతుందని ఆయన తెలిపారు. 'క్లిప్ అండ్ బ్లూ ప్లేస్‌మెంట్' విధానాన్ని అమెరికన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ ఆంకాలజీ సైతం గుర్తించింది.

శంభు సరిహద్దు వద్ద నినాదాలు చేస్తున్న రైతు సంఘాల నేతలు, రైతులు

నేడు రైతుల చలో ఢిల్లీ

- **శంభు సరిహద్దు నుంచి పాదయాత్ర**
- **భారీగా తరలి వచ్చిన అన్నదాతలు**
- **పంజాబ్, హర్యానా సరిహద్దులో భద్రత పెంపు.. భారీగా బారికేడ్లు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై రైతులు మరోసారి పోరాటానికి సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా ఇప్పటికే శంభు సరిహద్దుకు వేలాది మంది రైతులు చేరుకున్నారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్ల సాధనకు గతంలోనే ఉద్యమాలు ప్రారంభించిన రైతులు.. దానిని కొనసాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలి జాతగా శంభు, ఖనౌరి సరిహద్దుల నుంచి రాజధాని ఢిల్లీకి పాదయాత్ర చేయాలని రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు శంభు సరిహద్దు నుంచి 101 మంది రైతులతో తమ పాదయాత్ర ప్రారంభమవుతుందని కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) సమన్వయకర్త శర్వణ్ సింగ్ పాంథేర్ తెలిపారు. గురువారం ఆయన శంభు సరిహద్దులో మీడియాతో మాట్లాడుతూ ఇప్పుడు కూడా ప్రభుత్వం తమ పాదయాత్రను అడ్డుకుంటే అది తమ నైతిక విజయం అవుతుందని అన్నారు.

భారీగా బారికేడ్ల ఏర్పాటు

డిమాండ్ల సాధనకు రైతుల పాదయాత్రను పురస్కరించుకుని ఇప్పటికే ఎన్‌హెచ్ 44పై రైతులు పెద్దయెత్తున గుమిగూడి ఉన్న క్రమంలో హర్యానా, పంజాబ్‌లు శంభు సరిహద్దుకు రెండు వైపులా భద్రతను మరింత పటిష్ఠం చేశాయి. ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించే 163 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. కేంద్ర పారామిలటరీ బలగాలను ఇప్పటికే మోహరించారు. గురువారం హర్యానా పోలీసులు పంజాబ్ వైపు సరిహద్దులో అదనంగా మూడంచెలబారికేడ్లనుఏర్పాటు చేశారు.

హైదరాబాద్ యువతితో వివాహేతర సంబంధం

బ్రిటన్ వర్సిటీ వీసీ సస్పెన్షన్

లండన్: హైదరాబాద్‌కు చెందిన యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారన్న ఆరోపణలపై బ్రిటన్‌లోని బకింగ్‌హమ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జేమ్స్ టూలీ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆ యువతి యూనివర్సిటీ ఫీజులను కూడా టూలీ చెల్లించినట్టు ఆరోపణలు వచ్చాయి. 65 సంవత్సరాల టూలీతో తనకు లైంగిక సంబంధం ఉన్నట్లు ఆ యువతి తన డైరీలో రాసుకోగా టూలీ భార్య ఆ యువతికి చెందిన డైరీల కాపీలను యూనివర్సిటీకి అందచేశారు. టూలీ సస్పెన్షన్‌ను అక్టోబర్‌లో యూనివర్సిటీ ప్రకటించగా ఇప్పుడు అది వెలుగు చూసింది. మొదటిసారి టూలీని కలసినపుడు తనకు 18 ఏళ్లని, తనకు 21 ఏళ్ల వయసున్నపుడు ఆయనతో లైంగిక సంబంధం ఏర్పడిందని ఆ యువతి తన డైరీలో రాసుకున్నారు. ఇది జరిగిన కాలంలో టూలీ 50వ దశకంలో ఉన్నారని డైలీ మెయిల్ పత్రిక తెలిపింది.తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవిగా తన న్యాయవాది ద్వారా ఇచ్చిన ప్రకటనలో టూలీ స్పష్టం చేశారు. కాగా, 2022లో ఇద్దరు పిల్లల తల్లి అయిన నైజీరియాకు చెందిన సింథియా అనే మహిళతో టూలీకి వివాహమైంది.



పీఎస్‌ఎల్వీ-సీ 59 సక్సెస్

- ఐరోపా ఉపగ్రహాలను మోసుకెళ్లిన వాహకనౌక
- విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఇస్రో

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): అంతరిక్ష వాణిజ్య ప్రయోగాల్లో ఇస్రోకు చెందిన ఎన్‌ఎస్‌ఐఎల్ సరికొత్త విజయాన్ని అందుకుంది. ఐరోపా అంతరిక్ష సంస్థ(ఈఎస్‌ఏ) చేపట్టిన ప్రోబా-3 మిషన్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను పీఎస్‌ఎల్వీ-సీ59 వాహకనౌక ద్వారా విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)కు న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్‌ఎస్‌ఐఎల్) వాణిజ్య విభాగం. ప్రోబా-3 మిషన్ కోసం రెండు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టే కాంట్రాక్టును ఎన్‌ఎస్‌ఐఎల్‌కు ఈఎస్‌ఏ అప్పగించింది. ఇందులో భాగంగా గురువారం ఉదయం 8.05 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జంట ఉపగ్రహాలను మోసుకొని పీఎస్‌ఎల్వీ-సీ59 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 18 నిమిషాల ప్రయాణం తర్వాత ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడమే ప్రోబా-3 మిషన్ లక్ష్యం. దాదాపు 550 కిలోల బరువైన ఈ రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్, ఆక్యుల్టర్) భానుడి గుట్టు విప్పేందుకు ఉపయోగపడనున్నాయి. ఆ ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరించనున్నాయి. ఇందులో ఏ ఒక్కటి నిర్దిష్ట కక్ష్యలోకి చేరకపోయినా రెండో శాటిలైట్‌తో ఉపయోగం లేకుండా పోతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్(పీఎస్‌ఎల్వీ) నమ్మకమైన పనితీరుకు ఈ ప్రయోగం ఉదాహరణగా నిలిచిందని ఇస్రో పేర్కొన్నది. కాగా, ఈ ప్రయోగం బుధవారం చేపట్టాల్సి ఉంది. చివరి నిమిషంలో ప్రోబా-3 ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగాన్ని ఇస్రో గురువారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

మధుమేహం ముప్పును తగ్గించే డార్క్ చాకొలెట్!

న్యూఢిల్లీ: రుచికరమైన చాకొలెట్లను తినాలంటే భయపడేవారికి తాజా అధ్యయనం శుభవార్త చెప్పింది. మిల్క్ చాకొలెట్ల కన్నా డార్క్ చాకొలెట్లను తినడం వల్ల టైప్-2 మధుమేహం ముప్పు 21 శాతం వరకు తగ్గుతుందని వెల్లడించింది. హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ కీ సున్ మాట్లాడుతూ, డార్క్, మిల్క్ చాకొలెట్లలో ఒకే స్థాయిలో శాచ్యురేటెడ్ ఫ్యాట్, క్యాలరీలు ఉంటాయన్నారు. అయితే బరువు పెరగడం, మధుమేహంపై సంతృప్త కొవ్వు, సుగర్ చూపే ప్రభావాన్ని డార్క్ చాకొలెట్లలోని పాలిఫెనోల్స్ తగ్గించే అవకాశం ఉన్నట్టు కనిపించిందన్నారు. ఇది అత్యంత సంక్లిష్టమైన వ్యత్యాసమని అన్నారు.

కాఫీతో రెండేళ్ల అధిక ఆయుర్దాయం

న్యూఢిల్లీ: కాఫీ తాగడం ద్వారా మన ఆయుర్దాయానికి అదనంగా రెండేళ్లు జోడించవచ్చని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. 'ఏజింగ్ రిసెర్చ్ రివ్యూస్ జర్నల్'లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. కాఫీ తాగడం వల్ల సగటున 1.8 సంవత్సరాల ఆరోగ్యకరమైన జీవితాన్ని పెంచుకోవచ్చు. గతంతో పోలిస్తే ప్రపంచ జనాభా వేగంగా వృద్ధాప్యంలోకి జారుకుంటున్నదని, కాబట్టి దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించేందుకు అవసరమైన ఆహారాన్ని అన్వేషించడం అవసరమని పోర్చుగల్‌లోని కొయింబ్రా యూనివర్సిటీ లీడ్ రిసెర్చర్ రోడ్రిగో చున్హా పేర్కొన్నారు. ఈ విషయంలో కాఫీ ఆరోగ్యకరమైన, సమతుల్య జీవనశైలిలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు.

కాంగోను వణికిస్తున్న వింత వ్యాధి

15 రోజుల్లో 150 మంది మృతి

కిన్‌షస: కాంగోలోని క్వాంగో ప్రావిన్సులో అంతుచిక్కని ఓ వింత వ్యాధి దాదాపు 150 మందిని బలిగొంది. ఫ్లూ వంటి లక్షణాలతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. నవంబర్ 10 నుంచి 25 మధ్య పాంజీ హెల్త్ జోన్‌లో దాదాపు 150 మంది ఈ అంతుచిక్కని వ్యాధి బారిన పడి మరణించినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. వ్యాధికి గురైన చాలా మంది రోగులు తమ ఇళ్లలోనే మరణిస్తున్నారన్నారు. రోగుల నుంచి నమూనాలు సేకరించేందుకు ఒక వైద్య బృందం పాంజీ హెల్త్ జోన్ చేరుకుంది. తీవ్ర జ్వరం, భరించరాని తలనొప్పి, దగ్గు, నీరసం వంటివి ఈ గుర్తు తెలియని వ్యాధి లక్షణాలని ప్రొవిన్షియల్ ఆరోగ్య మంత్రి అపొల్లిరేర్ యుంబా తెలిపారు.

నో డాటా అవైలబుల్!

- **కేంద్రంలోని ఎన్డీయే సర్కారు తీరు**
- **ఎంపీల ప్రశ్నలకు సమాధానాల్లేవ్**
- **డాటా లేదంటున్న కేంద్ర మంత్రులు**

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: ఎన్డీఏ అంటే.. నో డాటా అవైలబుల్ అని ప్రతిపక్షాలు చేసే విమర్శలు నిజమే అన్నట్టుగా పార్లమెంటు సమావేశాలు సాగుతున్నాయి. దేశానికి సంబంధించిన అనేక అంశాలపై పార్లమెంటు సభ్యులు లోక్‌సభ, రాజ్యసభలో ప్రశ్నలు వేస్తుంటారు. వీటికి ఆయా శాఖల మంత్రులు సమాధానాలు సవివరంగా ఇవ్వాలి. అయితే, ఎన్డీఏ ప్రభుత్వం మాత్రం పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నది. అనేక ముఖ్యమైన అంశాలకు సంబంధించి ఎంపీలు అడిగిన ప్రశ్నలకు 'తమ వద్ద డాటా లేదు' అంటూ కేంద్రమంత్రులు సమాధానం చెప్పడం ఆశ్చర్యపరుస్తున్నది. పరీక్షల్లో పేపర్ లీక్‌లు, విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై వివక్ష, ప్రభుత్వ దవాఖానల్లో వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించిన నష్టం.. ఇలా ఎంపీలు అడిగిన అనేక ముఖ్యమైన ప్రశ్నలకు కేంద్రం వద్ద వివరాలు లేవని మంత్రులు ప్రకటించారు.

అనేక ప్రశ్నలకు ఒకే సమాధానం

ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలకు సంబంధించి ప్రభుత్వం డాటాను సేకరించడం లేదని హోంశాఖ బుధవారం పార్లమెంట్‌కు వెల్లడించింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న దవాఖానల్లో ఎంతమంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్న వివరాలు తమ వద్ద లేవని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం తెలిపింది. సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీలు, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎదుర్కొన్న వివక్షపై నమోదైన కేసుల వివరాల గురించి డాటాను నిర్వహించడం లేదని సమాధానం ఇచ్చింది. అలాగే పేపర్ లీక్‌లకు సంబంధించి అడిగిన ప్రశ్నకు సైతం కేంద్రం ఇలాంటి వివరణే ఇచ్చింది. ఇలా అనేక ప్రశ్నలకు 'నో డాటా' అంటూ కేంద్ర మంత్రులు ఒకే సమాధానాన్ని ఇస్తున్నారు.

చట్టాలన్నీ హిందీమయం చేస్తారా?

మోదీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న పలు బిల్లుల పేర్లు హిందీలోనే ఉండటం పట్ల గురువారం రాజ్యసభలో విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. కొత్త బిల్లుల పేర్లన్నీ హిందీలోనే పెడుతూ సర్వం హిందీమయం చేస్తున్నారని ఆరోపించాయి. ద భారతీయ వాయుయాన్ విధేయక్, 2024 బిల్లు పేరును వెంటనే మార్చాలని డీఎంకే ఎంపీ కనిమొళి, ఎన్‌వీఎన్ సోము డిమాండ్ చేశారు. దేశంలోని 56 శాతం మందికి హిందీ మాతృభాష కాదని, రాజ్యాంగం ప్రకారం చట్టం పేరు ఇంగ్లిష్‌లో ఉండాలని వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. అయితే ఈ బిల్లును తెలుగు మంత్రి అయిన కింజారపు రామ్మోహన్ నాయుడే ప్రవేశపెట్టారని బీజేపీ ఎంపీ ఘనశ్యామ్ తివారీ తెలిపారు.



టాప్-100 నగరాల్లో భారత్ నుంచి ఒకే ఒక్క సిటీ

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యంత ఆకర్షణీయమైన వంద నగరాల జాబితా-2024లో భారత్ నుంచి ఒకే ఒక్క నగరానికి చోటు దక్కింది. ఇక ఎప్పటిలానే వరుసగా నాలుగో ఏడాది కూడా ఫ్యాషన్ రాజధాని పారిస్ 17 మిలియన్లకుపైగా ఇన్‌బౌండ్ అరైవల్స్‌తో టాప్ ప్లేస్‌లో నిలిచింది. డాటా అనలిటిక్స్ కంపెనీ యూరోమోనిటర్ ఇంటర్నేషనల్ విడుదల చేసిన తాజా జాబితాలో మాడ్రిడ్, టోక్యో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ జాబితాలో ఇండియా నుంచి చోటు దక్కించుకున్న ఢిల్లీ 74వ స్థానంలో నిలిచింది.

8.5 లక్షల కోట్లతో

ప్రైవేటు అంతరిక్ష కేంద్రం

- **నిర్మిస్తున్న 'బ్లూ ఆరిజిన్' సంస్థ**
- **పర్యాటకులకు విడిదిగానూ వినియోగించేలా రూపకల్పన**

న్యూయార్క్, డిసెంబర్ 5: అంతరిక్ష వాణిజ్యంలో అపర కుబేరుల హవా నడుస్తున్నది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని కక్ష్య నుంచి సురక్షితంగా తొలగించే కాంట్రాక్టును ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ దక్కించుకోగా, కొత్త అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఆరిజిన్ సంస్థ తీసుకుంది. ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్) కాలపరిమితి ముగుస్తున్నది. 2031 నాటికి ఐఎస్‌ఎస్ కార్యకలాపాలు ముగుస్తాయి. ఈ నేపథ్యంలో కొత్త అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను బ్లూ ఆరిజిన్ సంస్థకు నాసా అప్పగించింది. ఆర్బిటల్ రీఫ్ పేరుతో అభివృద్ధి చేస్తున్న ఈ కొత్త అంతరిక్ష కేంద్రం 8,200 క్యూబిక్ అడుగుల స్థలంలో ఉంటుంది. ఇది మొట్టమొదటి ప్రైవేటు అంతరిక్ష కేంద్రంగా నిలవనుంది. 2027లో దీనిని ప్రయోగించాలని, 2030 నుంచి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.

అంతరిక్ష పర్యాటకులకూ..

ఈ ప్రాజెక్టుకు ఏకంగా రూ.8.5 లక్షల కోట్లను బ్లూ ఆరిజిన్ సంస్థ ఖర్చు చేయనున్నది. సయెర్రా స్పేస్, అమెజాన్, బోయింగ్ వంటి సంస్థలతో కలిసి ఈ సంస్థ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మిస్తున్నది. ఇప్పటివరకు ఉన్న అంతరిక్ష కేంద్రాలు కేవలం వ్యోమగాముల కోసం మాత్రమే వినియోగించారు. ఈ కొత్త కేంద్రాన్ని మాత్రం భవిష్యత్తులో అంతరిక్ష పర్యాటకులకు విడిదిగానూ వినియోగించేలా నిర్మిస్తున్నారు. మొదట 10 మందికి సరిపోయే స్థలంలో దీనిని నిర్మిస్తున్నారు. ఆ తర్వాత మరింత విస్తరించనున్నారు. భూదిగువ కక్ష్యలో ప్రవేశపెట్టే ఈ స్పేస్ స్టేషన్‌కు భారీ కిటికీలు ఉంటాయని, అక్కడి నుంచి భూమిని వీక్షించవచ్చని బ్లూ ఆరిజిన్ సంస్థ తెలిపింది. వ్యక్తిగత, వ్యాపార వినియోగానికి వీలుగా ప్రత్యేక క్వార్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, సురక్షితమైన, ఉత్తేజభరితంగా ఉండేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించింది.